RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 05 | డిసెంబర్ 05, 2025 | వెల : రూ.3-00



పార్టీలకు అతీతంగా ప్రతి డివిజన్ అభివృద్ధి చేస్తా

4లో..



# రూ.260.45 కోట్ల పనులు

- అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన - ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రోగ్రాం

**వేద న్యూస్, ఆదిలాబాద్:**

ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో రూ.260.45 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సహా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణంలోని 49 వార్డుల సమగ్రాభివృద్ధికి రూ.18.70 కోట్లు కేటాయించబడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ నిధులు వినియోగించనున్నారు.మహిళా సాధికారతలో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద రూ.1.75 కోట్లతో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. అదనంగా రూ.19.69 కోట్లతో 160 సంఘాలకు రుణాల మంజూరు చేపట్టనున్నారు.

**- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్**

విద్యా రంగంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఆధునిక బోధన, సౌకర్యాలు, వసతి వంటి అంశాలతో కూడిన ఈ స్కూల్ పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. అలాగే మహాలక్ష్మివాడ, విద్యానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2 కోట్లతో అదనపు గదులు, ఆధునికీకరణ చేయనున్నారు. పట్టణ శాంతి భద్రతను దృష్టిలో ఉంచుకుని రూ.11.93 కోట్లతో 18 పోలీస్ క్వార్టర్స్, రూ.2.6 కోట్లతో 3 ఇంటెలిజెన్స్ క్వార్టర్స్, రూ.2 కోట్లతో భరోసా కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, భద్రతా వ్యవస్థ బలోపేతానికి ఈ సదుపాయాలు దోహదపడనున్నాయి. పట్టణ పరిశ్రమల అభివృద్ధి, ప్రజల జీవన విధానంలో కీలకం అయిన విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు రూ.231.24 లక్షలతో కొత్త



33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇది నిరంతర విద్యుత్ సరఫరా, పరిశ్రమలకు శక్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ అభివృద్ధికి పునాది వేస్తున్న ఈ ప్రాజెక్టులు పట్టణ మౌలిక వసతులను బలోపేతం చేసి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

- ప్రధాని మోదీ ఘన స్వాగతం
- భారత్ - రష్యా శిఖరాగ్ర సమావేశంలో కీలక ఒప్పందాలు
- అణు విద్యుత్, వాణిజ్యం, ఆరోగ్యం సహా పలు రంగాల్లో చర్చలు
- రెండు రోజుల పర్యటనకు ఢిల్లీకి వచ్చిన పుతిన్



**వేద న్యూస్, న్యూ ఢిల్లీ :**

భారత్ - రష్యా సంబంధాల్లో కీలక మలుపుగా భావిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ రెండు రోజుల పర్యటన కోసం గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. పాలం ఎయిర్‌పోర్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్వాగతం పలకడం, ఆత్మీయ ఆలింగనం పంచుకోవడం ఈ పర్యటన ప్రాముఖ్యతను ప్రతిబింబించింది. విమానాశ్రయంలో కళాకారుల సాంప్రదాయ నృత్యాలతో పుతిన్‌కు ఘన స్వాగతం పలికారు. భారత్ - రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పుతిన్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య అణు విద్యుత్, ఇంధనం, పరిశ్రమలు, సంస్కృతి, వ్యవసాయం వంటి రంగాల్లో కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. పుతిన్ గౌరవార్థం ప్రధాని మోదీ గురువారం రాత్రి విందు ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో అధికారిక

మిగతా 3వ పేజీలో..

## ఎన్నికల ప్రక్రియ, రిజర్వేషన్‌లలో జోక్యం చేసుకోలేం తెలంగాణ హైకోర్టు

- ఆరు పిటిషన్‌లపై విచారణ అనంతరం కీలక వ్యాఖ్య
- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌లపై కోర్టు స్పష్టీకరణ
- సంబంధిత కులాలు లేనిచోట ఎన్నికలు నిర్వహించబోమని ఎన్నికల సంఘం

**వేద న్యూస్, హైదరాబాద్ :**




తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌ల వ్యవహారంలో ఆదిలోనే కోర్టు జోక్యం చేసుకోలేమని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. రిజర్వేషన్ కేటాయింపులను వ్యతిరేకిస్తూ దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారణ జరిపిన కోర్టు, ఎన్నికల ప్రక్రియలో నేరుగా జోక్యం సరికాదని వ్యాఖ్యానించింది. పిటిషనర్లు, ఎస్సీ - ఎస్టీ జనాభా లేని ప్రాంతాల్లో కూడా సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలను రిజర్వ్ చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ల కేటాయింపులో తప్పులు జరిగాయని వాదించారు. రిజర్వేషన్‌ల వల్ల ఎన్నికల్లో ప్రతిస్పర్ధించే అవకాశాలు కోల్పోతున్నామంటూ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, సంబంధిత కులానికి చెందిన అభ్యర్థులు లేనిచోట ఎన్నికలు నిర్వహించబోమని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కోర్టును సమాచారం అందించింది. నాణ్యమైన ఎన్నికల ప్రక్రియ నిర్వహణ బాధ్యత దృష్ట్యా, ప్రాంతీయ సామాజిక వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం వాదనలు, చట్టపరమైన పరిమితులను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, పిటిషన్‌లపై విచారణను ముగిస్తూ, ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ విధానంలో కోర్టు జోక్యం అవసరం లేదని తేల్చిచెప్పింది. ఎన్నికల ప్రక్రియపై కోర్టు ఆంక్షలు విధిస్తే, పూర్తి ఎన్నికల షెడ్యూల్ ప్రభావితమయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

## సైబరాబాద్ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్

- మాల్వేర్ దాడితో వెబ్‌సైట్లు నిలిచిపోయిన పరిస్థితి
- అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్

3లో.




## రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణం..!

- పారిశ్రామిక భూముల దోపిడీపై బీఆర్ఎస్ పోరుబాటలో కేటీఆర్ ఆరోపణ
- కుత్బుల్లాపూర్, జీడిమెట్ల ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటన

**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్న లక్షల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, భూముల కేటాయింపులో జరుగుతున్న అక్రమాలపై పరిశ్రమల కార్మికులతో, పారిశ్రామికవేత్తలతో మాట్లాడారు. పర్యటనకు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కూడా హాజరయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ, ఒకప్పుడు ప్రజలకు, పరిశ్రమలకు, ఉపాధి అవకాశాల కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ప్రభుత్వ దోపిడీ అని అన్నారు. ప్రజల కోసం కేటాయించిన భూములను అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు ఇస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే, ప్రభుత్వం కేవలం నాలుగు వేల రూపాయలకు భూములు అప్పజెప్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పేదలకు ఇళ్ళకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు స్థలం లేదని చెప్పే ప్రభుత్వం, అదే సమయంలో తొమ్మిది వేల ఎకరాల భూమిని ప్రైవేటులకు అప్పగిస్తోందని ఆయన అన్నారు. ఆదాయం కోసమే పరిశ్రమలు ఏర్పాటు చేసిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఉపయోగిస్తే, లక్షల మంది ఉపాధి కోల్పోతారని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉన్న భూములను తిరిగి తీసుకొని, ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూల్స్, ఆసుపత్రులు నిర్మించాలని ఆయన

మిగతా 3వ పేజీలో..




## ప్రజల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం కవిత



- ఉప్పల్ ఫ్లైఓవర్ పనుల్లో ఎనిమిదేళ్ల ఆలస్యం
- పనుల పురోగతిని పరిశీలించిన జాగృతి అధ్యక్షురాలు
- కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం లేకపోవడమే ఆలస్యానికి కారణం
- పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను స్వయంగా సందర్శించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పనుల ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా నిర్మాణం సాగుతున్నా, ప్రజల సమస్యలు అలాగే ఉన్నాయంటే ప్రభుత్వం పట్ల ప్రజల విశ్వాసం తగ్గిపోయిందని ఆమె వ్యాఖ్యానించారు. శాసన మండలిలో ఈ అంశంపై ప్రస్తావించినప్పుడు, మంత్రి కోమటి

మిగతా 3వ పేజీలో..

# డిసెంబర్ 12న ఇండక్షన్ ప్రోగ్రామ్

**వేద న్యూస్ కేయూ క్యాంపస్:**

విశ్వవిద్యాలయ కాంపస్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక ఇండక్షన్ ప్రోగ్రాం ఎక్స్ ఫ్లోర్, ఎంగేజ్, ఎక్సెల్ కార్యక్రమ గోడపత్రికను గురువారం సాయంత్రం కేయూ కమిటీ హాల్‌లో జరిగిన విభాగాధిపతుల సమావేశంలో, వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, విభాగాధిపతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం డిసెంబర్ 12న శుక్రవారం ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో విసి విభాగాధిపతులతో ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అకాడమిక్ ప్రమాణాలను అభివృద్ధి చేసే దిశగా అధ్యాపకులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. టైమ్‌టేబుల్ ప్రకారం తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలని, ఈ అకాడమిక్ ఇయర్ లో 1150 మంది విద్యార్థులు యూనివర్సిటీ కాలేజీలోని వివిధ పి.జి. కోర్స లలోప్రవేశాలు పొందినట్టు, తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఎంత తక్కువగా ఉన్నా క్లాసులు కొనసాగాలని పేర్కొన్నారు. విభాగాల రిసెర్చ్ వర్క్ పురోగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు. విశ్వవిద్యాలయం ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ లో మెరుగైన స్థానాన్ని లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. 2028 న్యాక్ గ్రేడింగ్ దృష్ట్యా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు ప్రారంభించాలని సూచించారు. టీచింగ్ డైరీలు, అకాడమిక్ రిపోర్టులు, హాజరు సంబంధిత వివరాలను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. విభాగాధిపతులు, ప్రిన్సిపాల్ లు మూడు నెలలకు ఒకసారి ఐక్యూఎసి కి అకాడమిక్, రీసెర్చ్, కో కర్రికులర్ ఆక్టివిటీస్ పురోగతి పై విభాగ రిపోర్టులను పంపాలని చెప్పారు. ఎన్‌ఈపి ప్రమాణాలకు అనుగుణంగా పీజీ సిలబస్ పునర్వ్యవస్థీకరణ పై డీన్ లు ఇప్పటికే పని చేస్తున్నారని, ఒక కామన్ టెంప్లెట్ ను ఆధారంగా పి.జి. సిలబస్ మార్పు పై విభాగాల అధిపతులు, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు సిద్దంగా ఉండాలన్నారు. అకాడమిక్ కమిటీలు ఇప్పటికే పనిచేస్తున్నాయని, విభాగాలు కూడా దానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. విధుల్లో అనుచితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని స్పష్టంచేశారు. ప్రతి నెలా విభాగాల పురోగతిని సంబంధిత పోర్టల్ లో అప్‌లోడ్ చేసి రిపోర్ట్ చేయాలని, విద్యార్థులు తరగతులకు హాజరు కావడానికి విభాగాధిపతులు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. విశ్వవిద్యాలయంలో అకాడమిక్, రీసెర్చ్ పురోగతిని వేగవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని వైస్ ఛాన్సలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.




# అజాతశత్రువు ఆచార్య సి.శివ రామ కృష్ణారావు




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగంలో ఆచార్య సి.శివరామకృష్ణ రావు 10 సంవత్సరాల యాది సభను అర్థశాస్త్ర విభాగం సెమినార్ హాల్లో విభాగాధిపతి ఆచార్య సురేష్ లాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య సురేష్ లాల్ మాట్లాడుతూ ఆచార్య శివరామ కృష్ణారావు గొప్ప మానవతావాది, అజాతశత్రువని తెలిపారు. సార్ విలువలను నేడు విభాగంలో కొనసాగిస్తూనే ఉన్నామన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆచార్య పాపిరెడ్డి మాట్లాడుతూ కొందరు మాత్రమే చరిత్రలో నిలిచిపోతారు అదే సార్ యొక్క ప్రత్యేకతని తెలిపారు. సామాజిక న్యాయం సార్ ద్వారానే సాధ్యమైందని ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులకు లాభం చేకూరిందని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఇక్బాల్ అలీ మాట్లాడుతూ సార్ పేరులో శివ రామ కృష్ణ అనే మూడు పదాలు ఉన్నాయని ఆపదాల వల్ల గొప్ప మేధావిగా పేరు పొందారన్నారు. గర్వం, అహంకారం, లేని వ్యక్తిత్వం సారుదని తెలిపారు. ఆచార్య విజయ మాట్లాడు తూ ఐదుగురు అర్థశాస్త్రవేత్తలు కూర్చుంటే ఆరవ ఆలోచన వస్తుందని దానికి నిదర్శనం సార్ అని తెలిపారు. ఆచార్య జ్యోతిరాణి మాట్లాడుతూ ప్రగతిశీల మహిళా ప్రజాస్వామ్య ఉద్యమాలకు సార్ కారణమని మానవీయ విలువలకు స్ఫూర్తికి సమాజ చైతన్యానికి సార్ ఆలోచనలు చేసేవారు అన్నారు. క్షేత్ర పర్యటన ద్వారా అర్థశాస్త్ర విభాగములో, సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలి అనేవారు. విలువలతో కూడిన ఉన్నత విద్యను పొంది ఉన్నత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని చెప్పే వారన్నారు. ఆచార్య మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు నిదర్శనం పెద్దసారు అని కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగానికి సార్ పితామహుడని తెలిపారు. ఆచార్య ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని, సార్ పేరును అర్థశాస్త్ర విభాగపు సెమినార్ హాల్ కు పెట్టాలని తెలిపారు. డాక్టర్ వెంకటయ్య డాక్టర్ విగ్నేశ్వర్ ఆచార్య కనకాచారి ఆచార్య మనోజాదేవి ఆచార్య సుదర్శన్ డాక్టర్ సాంబశివరావు డాక్టర్ రాజేష్ డాక్టర్ రమేష్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్ డాక్టర్ నవీన్ డాక్టర్ రవీందర్ డాక్టర్ కుమార్ డాక్టర్ కవిత డాక్టర్ సంధ్య డాక్టర్ విజయ డాక్టర్ కవిత తో పాటు శివరామకృష్ణ సార్ విద్యార్థులు స్కాలర్లు అధ్యాపకులు బోధ నేతల సిబ్బంది కొమరమ్మ గోపి విజయ్ అర్థశాస్త్ర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వైకల్యాన్ని అధిగమించి ముందుకు సాగాలి




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ సెల్ ఫర్ డిఫరెంట్‌లీ ఏబుల్డ్ పర్సన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు అన్ని వసతులు, అవకాశాలు కల్పించడానికి విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వీసీ ప్రతాప్ రెడ్డి కొనసాగిస్తూ, పరిపాలన భవనంలో లిఫ్ట్ సౌకర్యాన్ని ప్రారంభించినట్లు, హ్యూమానిటీస్ బిల్డింగ్, దూరవిద్యా కేంద్రంలో కూడా త్వరలో లిఫ్ట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం వసతులను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. వికలాంగులకు క్రీడా రంగంలో భాగంగా పారా ఒలింపిక్ క్రీడలు నిర్వహించాలని కాంపస్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. పరిశోధకులు, ప్రొఫెషనల్ విద్యార్థుల కోసం క్యాంపస్‌లో ఇంటర్నెట్ సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని, ఉచిత మెస్‌తో పాటు పలు వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అర్హతల ప్రకారం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేస్తున్నామని తెలిపారు. వైకల్యం అడ్డంకి కాదు, సంకల్పమే శక్తి అని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యత గల లాప్‌టాప్‌లు అందజేస్తామని, పీజీ విద్యార్థులకు కూడా ఈ సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయం అంతర్గత రవాణా కోసం దివ్యాంగులకు ప్రత్యేక వాహనం కోసం ప్రణాళికలు సమర్పిస్తామని చెప్పారు. వాస్తవాన్ని గుర్తించి లక్ష్యంపై దృష్టి పెట్టి ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చు. విజయమంతా మీ ప్రయత్నంపైనే ఆధారపడి ఉంటుంది. సెల్‌ఫోన్ వినియోగంలో జాగ్రత్త పాటించాలి. ప్రశ్నించే ధైర్యం పెంపొందించుకోవాలిబీ నాయకత్వ స్థాయికి ఎదగాలని సూచించారు. దివ్యాంగుల కోసం అందుబాటులో ఉన్న పలు ప్రభుత్వ జీఓలను వినియోగించుకోవాలని, వికలాంగుల చట్టం అత్యంత శక్తివంతమైందని, అవమానాన్ని అలంకారంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ పాలసీ వివరాలు తెలియజేసి, జీవన దీప్తిని గుర్తుచేశారు. పీహెచ్డీ, పీజీ పూర్తిచేసిన విద్యార్థుల డేటాను సేకరించి, వారికి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగ అవకాశాలకు ప్రాధాన్యతనిస్తామని అన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ప్రతి అడుగులో దృఢత్వం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కే. అనితా రెడ్డి, కాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. చెస్, క్యారమ్ పోటీల విజేతలు బి. స్రవంతి, జి. రజిత, చి. గోపి, బి. రాంబాబు, చి. ఆంజనేయులు, బోస్కా నాగరాజు, ఎం. భూపాల్ రెడ్డి, ఎన్. చంద్రమోహన్, డాక్టర్ శ్రీధర్ కుమార్ లొద్ కు మెమెంటోలు అందజేశారు. తెలుగు విభాగంలో పీహెచ్డీ పూర్తిచేసిన శారద, 10వ ఆసియన్ పారా తైక్వాండో ఛాంపియన్ మాచర్ల కృష్ణవేణి లను శాలువాలతో సత్కరించారు. దివ్యాంగ విద్యార్థి అసోసియేషన్ అధ్యక్షుడు రాములు స్వాగతం పలికారు. రాంబాబు వందన సమర్పణ చేశారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ దాఖలు చేసిన కేంద్రాలను సిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య గురువారం పరిశీలించారు. పెద్దలింగాపూర్ ,ఇల్లంతకుంట, వంతడుపుల ,గాలి పెల్లి, పొత్తూరు ,నామినేషన్ కేంద్రాలను ఆయన సిబ్బందితో ,కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో ఉన్న ఆర్వో, ఏ ఆర్ ఓ లతో మాట్లాడారు. వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఫసియుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ ,బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ ఆర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**వేద న్యూస్ ,కాసిపేట:**

కాసిపేట మండలంలోని లంబాడి తండా(డీ) గ్రామ పంచాయతీ పరిధిలో గుడుంబా తయారీ, నిల్వ జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు గురువారం దేవాపూర్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేవాపూర్ ఎస్ ఐ గంగారాం తన సిబ్బందితో కలిసి తండాలో పలు చోట్ల గుడుంబా నిల్వ చేసిన స్థావరాలను గుర్తించి దాడులు చేప ట్టారు పరిశీలనలో భారీగా నిల్వ ఉంచిన గుడుంబా ను పోలీసులు స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్థానికంగా అక్రమ మద్యం త యారీ, విక్రయం వల్ల సామాజిక సమస్యలు తీవ్రంగా పెరుగుతున్నాయని గుర్తించిన పోలీసు లు, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్ ఐ గంగారాం హెచ్చరించారు. గ్రామ ప్రజలు కూడా అక్రమ గుడుంబా తయారీ, రవాణా గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



# క్రీడా పోటీల్లో విజేతలకు అభినందనలు

**– ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు**




**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

రైసింగ్ డే వేడుకలలో భాగంగా రెండు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల తుది మ్యాచ్‌లు ఇవాళ జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ హాజరై రమాయంపేట్ సర్కిల్ మరియు మెదక్ సర్కిల్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత వాలీబాల్ ఫైనల్‌ను వీక్షించారు. ఈ పోటీలో మెదక్ సర్కిల్ అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం, రామాయంపేట సర్కిల్ ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డి పోటీల్లో అల్లాదుర్గ్ సర్కిల్ మొదటి స్థానం, రామాయంపేట సర్కిల్ రెండవ స్థానం కైవసం చేసుకున్నాయి. మ్యూజికల్ చైర్ పోటీలో భూలి మొదటి స్థానం, లావణ్య ద్వితీయ స్థానం సాధించి మంచి ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రైసింగ్ డే సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో హోమ్ గార్డ్ సిబ్బంది చూపిన ప్రతిభ నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఆసక్తి, క్రమశిక్షణతో భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొనే స్థాయికి ఎదగాలని సూచించారు. హోమ్ గార్డ్ సిబ్బందికి రైసింగ్ డే సందర్భంగా క్రీడాలు నిర్వహించడంపై సిబ్బంది ఆనందం వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఆర్‌ఐలు రామ కృష్ణ, శైలందర్, ఆర్ ఎసై లు సిబ్బంది ఉన్నారు.

# నిబంధనలు విస్మరిస్తే సీజే..!

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ లో భాగంగా గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా ఆమె ఆస్పత్రుల నిర్వాహకులకు, డాక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రిసెప్షన్ కౌంటర్ యందు చికిత్సలకు సంబంధించిన ధరల పట్టిక వివరాలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, వైద్యులు మరియు సిబ్బంది వివరాలు తప్పనిసరిగా కనిపించేలా ప్రదర్శించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు.అంతేకాకుండా, హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు పాటించాలని, వ్యాధిగ్రస్తులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్హత కలిగిన వైద్యులు మరియు సిబ్బందిని మాత్రమే నియమించాలని, డయాగ్నస్టిక్ కేంద్రాలు మరియు ల్యాబ్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు.హాస్పిటల్ రికార్డులు మరియు సరైన మెడికల్ రిపోర్టులు క్రమంగా ఉంచాలని ఆమె హెచ్చరించారు.నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న హాస్పటల్లను రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని లేదా సీజ్ చేస్తామని ఈ సందర్భంగా డాక్టర్ రజిత తెలియజేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

**– కాంగ్రెస్ అభ్యర్థి మూడవత్ రాజు**

**వేద న్యూస్, టేక్మాల్ :**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ పరిధిలోని ప్రత్యేక షాబాద్ లంబాడి గ్రామ పంచాయతీ లో ప్రచారం లో దూసుకెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి యం, రాజు నాయక్ గ్రామాన్ని ప్రజలందరూ నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి మూడవత్, రాజు కోరారు.గురువారం నాడు సర్పంచ్ భరిలో ముగ్గురు ఉన్నారు, ముగ్గురు అభ్యర్థులలో కాంగ్రెస్ అభ్యర్థి కి బలం వ్యక్తులు ఉండగా చేయించడం జరిగింది, ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలు, వీధి లైట్లు, విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి పెడతానని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకుంటానని చెప్పారు. ఏ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందకపోయినా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు కార్యకర్తలు సురేష్, సేవాలాల్, నిల్యా, విట్టల్, చందర్, సుభాష్, రాజు, బాబు, వస్రం మొత్య తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

స్వాగతం అనంతరం ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం, భారత్ – రష్యా ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. దాదాపు ఒక దశాబ్దం తరువాత, రష్యా%–%ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంతో భద్రతా అంశాలు, ప్రపంచ రాజకీయ పరిస్థితులపై కూడా ఇరు దేశ నేతలు చర్చించే అవకాశముంది భారత్ – రష్యా ద్వైపాక్షిక వాణిజ్యంలో ఉన్న సమతుల్యత లోటును తగ్గించేందుకు భారత్ ప్రయత్నాలు చేపట్టింది. ఔషధాలు, ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు వంటి రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. దీంతో భారత ఉత్పత్తులకు భారీ మార్కెట్ లభించడమే కాకుండా, దేశీయ పరిశ్రమలు, రైతులకు లాభదాయక పరిస్థితులు సృష్టించబడతాయి. రష్యా అధ్యక్షుడితో పాటు పలు వ్యాపార ప్రతినిధులు కూడా వచ్చారు. షిప్పింగ్, ఆరోగ్య పరిరక్షణ, ఎరువులు, టెక్నాలజీ, రవాణా రంగాల్లో ఒప్పందాలు, అవగాహన పత్రాలు కుదిరే అవకాశాలు ఉన్నాయి. అదనంగా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడి, శాస్త్రీయ పరిశోధన, నైపుణ్య అభివృద్ధి రంగాల్లో కొత్త భాగస్వామ్యాలు ఏర్పడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటనతో భారత్%–%రష్యా సంబంధాలు రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో మరింత బలపడతాయని, ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణం..!

అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఈ భూములను పరిశ్రమలకే కేటాయించి, ఉద్యోగావకాశాలు సృష్టించాల్సి ఉందన్నారు. జీడిమెట్ల ప్రాంతంలో మార్కెట్ ధర గజానికి కనీసం లక్ష రూపాయలు ఉన్న భూమిని కేవలం నాలుగు వేల రూపాయలకు ప్రైవేటులకు ఇవ్వడం భారీ ఆస్తి దోపిడీ అని కేటీఆర్ పేర్కొన్నారు. ఒకవైపు ప్రైవేట్ వేలంలో ఎకరానికి వంద కోట్లకుపైగా ధర పలుకుతుంటే, మరొకవైపు కోట్లాది విలువ చేసే భూమిని కోటి రూపాయలకు అమ్మడం కాంగ్రెస్ చేస్తున్న కుంభకోణానికి నిదర్శనం అని చెప్పారు. తమ పాలనలో గ్రిడ్ పాలసీ ద్వారా కాలుష్యం లేని పరిశ్రమలకు మాత్రమే భూములు ఇచ్చామని, ఐటీ కార్యాలయాలకు ఇచ్చిన ప్రోత్సాహంతో ఉపాధి అవకాశాలు పెరిగాయని చెప్పారు. కానీ ప్రస్తుతం పారిశ్రామిక భూములను రియల్ ఎస్టేట్ కోసం మార్చడం నగర భవిష్యత్తును నాశనం చేస్తుందని అన్నారు. ఫార్మాసిటీని కూడా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం వాడుతున్నారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దందాకే పరిమితమైన నాయకుడు అని విమర్శించారు. ఈ భూ దోపిడీపై సమాచారం ఇచ్చింది తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ఓ యువకుడు అని, ప్రభుత్వం సమాచారం లీక్‌పై బాధపడకుండా, ప్రజల భూమి ఎందుకు దోచుకుంటున్నదో వివరణ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అఖిలపక్ష సమావేశాలు, ప్రజా చర్చలు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని, తమ ప్రభుత్వం రాగానే ఈ పాలసీని రద్దు చేసి, దానికి వ్యతిరేకంగా చట్టం తీసుకువస్తామని ప్రకటించారు.ప్రజల భూమిని కాపాడడమే తమ బాధ్యత అని, ప్రభుత్వం చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పోరుబాట కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ప్రజల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం కవిత



రెడ్డి హామీ ఇచ్చినా, పరిస్థితిలో మార్పు లేదని పేర్కొన్నారు. కవిత మాట్లాడుతూ, "ఎనిమిదేళ్లుగా కదు తున్నారంటే ప్రజల పట్ల ప్రభుత్వాల కు చిత్తశుద్ధి ఎంత ఉందో అర్థమవు తోంది. ఈ ఫ్లైఓవర్ వల్ల ఘట్కేసర్ వరకు ప్రయాణించే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాలని లక్ష్యం. కానీ కాంట్రాక్టర్ మారినా, పని మాత్రం ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది" అని అన్నారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం కోసం జాగృతి జనం బాటలో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కోఆర్డినేషన్ లేకపోవడమే పనుల ఆలస్యానికి ప్రధాన కారణం అని కవిత ఆరోపించారు. "కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు పూర్తిచేయించాలి. ఈ ప్రాంత ఎంపీ ఈటల రాజేందర్ ఇక్కడికి వచ్చి పరిస్థితి చూడాలి. ఇది సెంట్రల్ ప్రాజెక్ట్ కనుక బీజేపీ ఎంపీగా బాధ్యత తీసుకోవాలి" అని ఆమె అన్నారు. "స్థానిక ఎమ్మెల్యే కూడా నిరసన తెలుపుతూ, వెంటపడుతూ పనులు చేయించాలి. కేంద్రం, రాష్ట్రం కలిసి తక్షణమే నిర్మాణాన్ని పూర్తి చేయాలి. లేదంటే జాగృతి సంస్థ ప్రభుత్వం వెంట పడి పనులు చేయిస్తుంది" అని కవిత హితవు పలికారు.

# సైబరాబాద్ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ పోలీస్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లపై సైబర్ దాడి చేశారు. సుమారు పది రోజులుగా రెండు కమిషనరేట్ల అధికారిక వెబ్‌సైట్లు పనిచేయకపోవడం వల్ల పౌరులకు, పోలీస్ శాఖకు అసౌకర్యం కలిగినట్లు సమాచారం. ఇదే సమస్యను కొద్ది రోజుల క్రితం హైకోర్టు వెబ్‌సైట్ కూడా ఎదుర్కొనడం సైబర్ భద్రతపై ఆందోళనలు పెంచింది. ప్రాథమిక పరిశీలనలో వెబ్‌సైట్లలోకి మాల్వేర్ చొరబడి సర్వర్లను దెబ్బతీసిందని అధికారులు భావిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే పోలీస్ సమాచారం బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. ఈ పరిణామంతో రెండు కమిషనరేట్లు సర్వర్లను డౌన్ చేసి, సమస్యను ఎన్ఐసీ (జాతీయ ఇన్ఫర్మేటిక్స్ కేంద్రం) దృష్టికి తీసుకెళ్లాయి. సమస్యను పరిష్కరించేందుకు ఐటీ బృందాలు, ఎన్ఐసీ నిపుణులు కలిసి సర్వర్ల పునరుద్ధరణ పనులు చేపట్టాయి. వెబ్‌సైట్లను తిరిగి ఆన్‌లైన్ చేయడానికి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, భద్రతా ప్యాచ్‌లు అమలు చేస్తున్నారు. భవిష్యత్తులో హ్యాకింగ్ అవకాశం ఉండకుండా అధునాతన ఫైర్‌వాల్స్, భద్రతా ఆడిట్ నిర్వహిస్తున్నారు. సైబర్ దాడి వెనుక ఉన్న ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ డిజిటల్ ఫోరెన్సిక్ పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, ఇలాంటిదే దాడి పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లను కూడా ప్రభావితం చేసినట్లు సమాచారం. డార్క్ వెబ్‌లో 22 ప్రభుత్వ వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంది అని నిపుణులు హెచ్చరించారు. సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ డిజిటల్ మౌలిక సదుపాయాల భద్రతను బలోపేతం చేయాల్సిన అవసరం ఉద్భవించింది.

# నిద్రిస్తున్న కుమార్తె గొంతు కోసిన వ్యక్తి

**వేద న్యూస్ డెస్క్ :** భార్యకు వివాహేతర సంబంధం ఉన్నదని ఒక వ్యక్తి అనుమానించాడు. అయితే నిద్రిస్తున్న కుమార్తె గొంతును బ్లేడ్‌తో కోశాడు. కూతుర్ని కాపాడేందుకు ప్రయత్నించిన భార్యపై కూడా బ్లేడ్‌తో దాడి చేశాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. హనుమంత్ సోనావాలే ఏ పని చేయకపోగా మద్యానికి బానిస అయ్యాడు. భార్య రాజశ్రీకి వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానించి తరచుగా ఆమెను కొట్టేవాడు. కాగా, భర్త హింసను భరించలేని భార్య రాజశ్రీ ఒక లాయర్ ద్వారా విడాకుల కోసం కోర్టులో పిటిషన్ వేసింది. ఇది తెలిసి హనుమంత్ సోనావాలే . భార్యతో గొడవపడ్డాడు. గురువారం తెల్లవారుజామున నిద్రిస్తున్న 14 ఏళ్ల కుమార్తె గొంతును బ్లేడ్‌తో కోశాడు. మరోవైపు కూతురి అరుపులకు రాజశ్రీ మేల్కొన్నది. భర్తను అడ్డుకునేందుకు ఆమె ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో భార్య పొట్టపై బ్లేడ్‌తో భర్త దాడి చేశాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా హనుమంత్‌ను అరెస్ట్ చేశారు. కాగా, గాయపడిన భార్య, కుమార్తెను హాస్పిటల్‌కు పోలీసులు తరలించారు.

# బీఆర్ఎస్ లోకి చేరికలు

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ వేడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. గురువారం కొండాపూర్ యాప గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు పోడేటి చంద్ర గౌడ్ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం స్థానిక రాజకీయంలో చర్చనీయాంశమైంది. చిన్నయ్య ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ, "స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు పొందిన అభ్యర్థులు అధిక స్థానాల లో గెలిచి తమ సత్తా చాటుతారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరవరు," అని అభిప్రాయపడ్డారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ, "సమన్వయంతో పనిచేస్తూ సర్పంచ్, వార్డు స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థులను గెలిపించాలి. ప్రజలు అభివృద్ధిని ఆకాంక్షిస్తుంటే బీఆర్ఎస్ మాత్రమే దాని హామీ ఇవ్వగలదు," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణా రెడ్డి, సీనియర్ నేతలు రాంటింకి వాసుదేవ్, సుధాకర్ రెడ్డి, ఈర్ల లచ్చన్న, గ్రామ అధ్యక్షుడు కంది ధర్మయ్య, మాజీ ఉప సర్పంచ్లు పోడేటి సుమన్ గౌడ్, దుర్గం సూర్యప్రకాశ్, నాయకులు కంది నరేష్, సురేష్, రాజేష్, రాజశేఖర్, శ్యాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట,ముస్తాబద్ మండలాలలో పలు నామినేషన్ సెంటర్స్ తోపాటుగాపెద్దమ్మ,వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.మహేష్.బి.గితే. గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎల్లారెడ్డిపేట , ముస్తాబద్ మండలలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్స్ తో పాటుగా పెద్దమ్మ ,వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే గ్రామ పంచాయతీలకు ,వార్డులకు మూడవ విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభ కావడం జరిగిందని , నామినేషన్ ప్రక్రియకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లును చేయడం జరిగిందన్నారు.సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తు అక్రమ మద్యం,డబ్బు రవాణాలను అడ్డుకునేందుకు ప్రతీ వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతుందని,దీనిలో భాగంగా పోలీస్ సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నమని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లగించిన వారిపై ఇప్పటికే ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించగా, 20 కేసుల్లో 209 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని,శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 158 కేసుల్లో 657 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట సిఐ లు శ్రీనివాస్, మొగిలి,ఎస్ఐ లు గణేష్, అనిల్ సిబ్బంది ఉన్నారు.

# న్యాయవాది చామర్తి ప్రభాకర్ రావుకు ఘన సన్మానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ రామన్నపేట లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రముఖ న్యాయవాది దేశాయి పేటకి చెందిన చామర్తి ప్రభాకర్ రావును ట్రస్ట్ చే ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేద్రప్రసాద్ మాట్లాడుతూ చిన్ననాటి మిత్రుడు మాతోపాటు కలిసి 7,8, 9, 10 తరగతుల వరకు కలసి చదువుకున్నాడు. మా మిత్రుడు న్యాయవాది కావటం మాకు చాలా సంతోషకరమైన విషయం ఒక గొప్ప వ్యక్తిగా సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తూ అలాగే తన వృత్తిలో న్యాయం చేస్తూ ఇతరులకు మార్గదర్శకంగా ఉంటూ సమాజంలో తన వంతు కర్తవ్యంగా ఎన్నో కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. మాతో చదువుకున్నటువంటి వారిని పిలవడం మాకు కూడా గర్వకారణం అని చెప్పవచ్చు. అడ్వకేట్ ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో మంచిని పెంచడానికి అనేక మంది అనేక రకాలుగా ప్రయత్నం చేస్తుంటారు ఆ సందర్భంలోనే మా మిత్రుడు రాజేంద్ర ప్రసాద్ కూడా తన వంతుగా సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజంలో ఉన్నటువంటి మంచి పనులు చేస్తున్నటువంటి అనేక మందిని సన్మానిస్తూ వాళ్లకి ప్రోత్సహిస్తూ సమాజంలో మరింతగా మంచిని పెంచడానికి మంచిని ప్రోత్సహించడానికి మంచి చేయటానికి ప్రేరేపణ కలిగించడానికి ప్రయత్నం చేసినందుకు అతనిని మనసారా అభినంది స్తున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్. ఏ. రాజేంద్ర ప్రసాద్ తోపాటు ఆర్గనైజర్ శ్రవణ్ మెంబర్స్ ఎం .హనుమంతరావు, ప్రసాద్, సాంబయ్య మరియు కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

# సమస్యలపై పోరాడితే అరెస్టులా..!?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- శివనగర్ వాటర్ ట్యాంక్ అండర్ డ్రైనేజీ పనుల వద్ద బీజేపీ నిరసన



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

అండర్ డ్రైనేజీ పనుల జాప్యంపై బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. గురువారం శివనగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనుల వద్ద బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టింది. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రికత్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఆందోళన విరమించాలని కోరగా అధికారులు వచ్చి పనుల పూర్తిపై హామీ ఇస్తేనే విరమిస్తామని పట్టుబట్టారు. భారత్ మాతాకీ జై.. అధికారులు నిర్లక్ష్యం నశించాలని నినాదాలు చేయడంతో బీజేపీ శ్రేణులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌తోపాటు ఇతర నాయకులను బలవంతంగా లాక్కెళ్లి పోలీసు వాహనంలో ఎక్కించారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. నాయకులను బలవంతంగా పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరువైపులా నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడితే దౌర్జన్యం చేయడమేకాక, అక్రమంగా అరెస్టు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పోలీసు రాజ్యం సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు పాలన చేతకాదని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రోడ్లమీదకు వస్తే.. పోలీసులతో అక్రమ కేసులు పెట్టించి, దౌర్జన్య కాండ కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. ఐదేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న శివనగర్ అండర్ డ్రైనేజీ పనులు ఇంకెప్పుడు పూర్తి చేస్తారని, ప్రజలు నరకయాతన పడుతున్నా పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురువారం శివనగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనుల వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంట రవికుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులు గత ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యం అవలంబిస్తోందని మండిపడ్డారు. స్థానిక మంత్రి కొండా సురేఖ కనీసం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. మంత్రికి కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ సమస్యల్ని పరిష్కరించడంలలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ పనుల జాప్యంతో నర్సంపేట నుంచి ఖమ్మం వెళ్లే రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. చిన్నపాటి వర్షం పడిందంటే చాలు శివనగర్ నీటమునిగి కాలనీవాసులు అనేక పాట్లు పడుతున్నారని వెల్లడించారు. సరైన దారిలేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయ ని, వాహనదారులు ఆస్పత్రి పాలవుతున్నారని వాపోయారు. అయినా మంత్రి సురేఖ ఒక్కసారైనా పనులను పరిశీలించిన దాఖలాలు లేవని ఆరోపించారు. సురేఖను ఓట్లేసి గెలిపిస్తే ఆమె గడీని దాటి రావడం లేదని విమర్శించారు. వరంగల్‌లో ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించిన దాఖలాలు లేవని, కనీసం వరంగల్ బస్టాండ్‌ను కూడా నిర్మించలేని దుస్థితిలో మంత్రి సురేఖ ఉండడం ఈ ప్రాంత దురదృష్టమన్నారు. మరోవైపు కేంద్రం భారీగా స్మార్ట్ సిటీ కింద నిధులు విడుదల చేసినా అభివృద్ధి పనులు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా శివనగర్ అండర్ డ్రైనేజీ పనుల్లో వేగం పెంచి త్వరలోనే పూర్తి చేయాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గంట రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, గడల కుమార్, మాచర్ల దీన్ దయాళ్, జిల్లా నాయకులు బైరి శ్యామ్, ఆడేపు వెంకటేష్, మార్టిన్ లూథర్, బైరి నాగరాజు, మండల నాయకులు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, తమ్మిశెట్టి క్రాంతి, తాళ్ళపెల్లి శ్రీను, నవీన్, సురేందర్, మార్తా ఉష రాణి, సుజాత మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం డిసెంబర్ 05, 2025

# అమర సైనికుల కుటుంబాలకు విరాళాల సేకరణ



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో అమర సైనికుల కుటుంబాలకు విరాళాల సేకరణ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, డి హెచ్ రావు తెలిపారు. పదవ తెలంగాణ బెటాలియన్ పర్యవేక్షణలో విరాళాల సేకరణ నిర్వహించినట్లు మరియు భారతదేశంలో వివిధ ఆర్మీ కంపెనీలలో పనిచేస్తూ వికలాంగులు లేదా మరణించిన సైనిక కుటుంబాలకు డిసెంబర్ మొదటి వారం దేశవ్యాప్తంగా విరాళాల సేకరణ చేపడతారని ఇది కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కన్వీనర్ గా సైనిక కుటుంబాలకు విరాళాలు సేకరించడం అంటే ఎంతో గౌరవం గా భావించాలని వారి యొక్క త్యాగాల ఫలితమే దేశ సుఖశాంతులకు నిలయం మని దేశ రక్షణకు వారి కుటుంబాలకు దూరమైన అమర సైనికులకు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విరాళాల సేకరణ కళాశాలలో మరియు పబ్లిక్ ప్లేస్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, హరి లోకేష్, రశ్మిత, మనుష, రజిత పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రతి డివిజన్ అభివృద్ధి చేస్తా

## - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వేద న్యూస్, హనుమకొండ :**

అవసరమున్న ప్రతి డివిజన్ లలో పార్టీలకు అతీతంగా చరిత్రలో నిలిచే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 4వ డివిజన్ అక్షర కాలనీ,యాదవ నగర్ మరియు 9 డివిజన్ గణేష్ నగర్ లలో సూమరు రూ.1.20 కోట్లతో సీసీ రోడ్డు,సీసీ డ్రైన్ లు మరియు పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఆయా వార్డులలో స్థానిక ప్రజలతో కలిస్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు.చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేని సత్కరించికుని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం ప్రతి పనిని త్వరగతిన పూర్తిచేసేలా అధికార యంత్రంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ప్రతి డివిజన్లలో అభివృద్ధి పర్యటనలు చేస్తున్న క్రమంలో ప్రజలనుంచి విశేష ఆదరణ కనిపిస్తుందని అన్నారు.ఇటీవలే జరిగిన కౌన్సిలో సుమారు రూ.30 కోట్ల ప్రతిపాదనలు చేశానని,బల్దియా పరిధిలో గతంలోకంటే మెరుగైన సౌకర్యాలు,సంక్షేమాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.వచ్చే నెలలోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు మొదలుకానున్నాయని వెల్లడించారు. యూడీసీ పనులలో కొత్త సీసీ రోడ్లకు సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.వచ్చే ఏడాది చివరకి నియోజవకర్గ పరిధిలో ప్రధాన,అత్యవసర రోడ్లు,డ్రైన్ ల నిర్మాణాలు పూర్తి అవుతాయని హామీ ఇచ్చారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాల విషంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.అధికారులు సైతం జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో వెళ్లి పర్యటనలు చేయాలని సూచించారు.నాణ్యత ప్రమాణాల్లో తేడావస్తే అధికారులు,సంబధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**వేద న్యూస్, కాసిపేట:**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామంలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామస్తులకు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 ప్రాధాన్యతను, డిజిటల్ మోసాల నుండి రక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలను పోలీసులు వివరించారు. “నేటి కాలంలో క్యూ ఆర్ కోడ్ మోసాలు, బ్యాంక్ కాల్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి సైబర్ నేరాలు అధికమవుతున్నాయి. ఎవరికైనా ఆన్‌లైన్ మోసం జరిగిన వెంటనే గంటలోపు 1930కి కాల్ చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆలస్యం చేస్తే అవకాశాలు తగ్గిపోతాయి,” అని స్పష్టం చేశారు.వ్యక్తిగత వివరాలు, ఓటిపి ఎవరితోనూ పంచుకోవద్దని,అజ్ఞాత లింకులు, ఫేక్ యాప్స్, తెలియని నంబర్ల నుండి వచ్చే మెసేజ్‌లను నమ్మరాదని,సోషల్ మీడియా సెక్యూరిటీ సెట్టింగ్స్‌ను కట్టుదిట్టంగా ఉంచాలని సూచించారు.

# సోమగూడెంలో సైబర్ నేరాలపై అవగాహన



**వేద న్యూస్, కాసిపేట:**

మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం గ్రామంలో గురువారం సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. గ్రామస్తులకు రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ మోసాలు, వాటి నుండి ఎలా జాగ్రత్తపడాలో వివరంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన పోలీసులు ఆన్‌లైన్‌లో వచ్చే తెలియని లింకులు, క్యూ ఆర్ కోడ్ స్కామ్‌లు, బ్యాంక్ కాల్ మోసాలు, సోషల్ మీడియా అకౌంట్ హ్యాకింగ్ వంటి అంశాలను ప్రజలకు సులభమైన భాషలో వివరించారు.అలాగే, అజ్ఞాత లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీ బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని,ఇంటర్నెట్ లావాదేవీల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, మోసపోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.యువతలో పెరుగుతున్న సోషల్ మీడియా మోసాలను తగ్గించడానికి తల్లిదండ్రులు, కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజలు యువత, మహిళలు పాల్గొని సైబర్ భద్రతపై ముఖ్యమైన విజ్ఞానాన్ని పొందారు.

# రోడ్డు రవాణా శాఖ తనిఖీలు




**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాలలో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేశారు. తనిఖీలలో లారీ, ట్రాక్టర్ ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎం వి ఐ వంశీధర్ తెలి పారు. వాహన దారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను రోడ్లపై తిప్పరాదని సూచించారు. తనిఖీలలో పిసి ప్రశాంత్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయాలు తనిఖీ



**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పలు ఎంపీడీఓ కార్యాలయాలను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఇల్లంతకుంట ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి,ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..

**అమరావతి, వేద న్యూస్:** చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. గురువారం చిలకలూరిపేట బైపాస్‌పై రోడ్డుపై ఓ కారు కంటెయినర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ ఆ ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గుంటూరు నుంచి ఒంగోలు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతులను విజ్ఞాన్ కాలేజ్ విద్యార్థులుగా గుర్తించారు.

# ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలి

## - రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని





**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన స్టేజ్ 2 జోనల్ ఆఫీసర్ల శిక్షణ తరగతులు, సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ కు ఏర్పాట్లు, వెబ్ కాస్టింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ తదితర అంశాలపై కమిషనర్ సమీక్షించారు. ఎన్నికలు ముగిసే వరకు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని నిబంధనలు తు.చ తప్పక పాటించాలని సూచించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉపసర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్ల పై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలలో ఉప సర్పంచ్ నియామకం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన గ్రామ సర్పంచ్ పోస్టులకు ఫారం10 ప్రకారం ఫలితాల ప్రకటన చేపట్టాలని అన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత సంబంధిత గ్రామాలలో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డీపీఓ కల్పన రావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# భక్తుల ప్రాణాలతో చెలగాటం!

## - మిడ్ మానేరు గేట్ల సమీపాన ఇసుక తవ్వకాలు..!

## - చూసీ చూడనట్టుగా సంబంధిత శాఖ అధికారులు?




**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర జలాశయం గేట్ల సమీపం నుండి, ఇసుక తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నారు. దీనివలన భవిష్యత్తులో జలాశయ గేట్లకు ప్రమాదం పొంచి ఉంటుంది కదా!.అసలు మిడ్ మానేరు గేట్లకు ఎన్ని మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలకు పరిమిషన్ ఇవ్వాలో సంబంధిత శాఖ అధికారులకు తెలియదా? అని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందికట్కూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్దకు నిత్యం దైవ దర్శనానికి భక్తులు వస్తుంటారు. అంతేగాకుండా పుణ్య స్నానాలు కోసం చుట్టుపక్కల ప్రాంతాలలో నుండి కూడా భక్తులు వస్తారు. గతంలో సుమారు ఒక ఆరుగురు భక్తులు మిడ్ మానేరు నదిలో చనిపోయారు.దీనికి కారణం అక్కడ ఇసుక తవ్వకాలు జరపడం వల్ల వచ్చిన వారికి లోతు తెలియక అందులో మునిగి మృతి చెందుతున్నారు.ఈ విషయమును సంబంధిత శాఖ అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన కూడ వారు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు.గతంలో ఎంత మంది తహసీల్దారులు వచ్చిన కూడా ఇక్కడ ఇసుక తవ్వకాలకు పర్మిషన్ ఇవ్వలేదు. కానీ, ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ ఇందిరమ్మ ఇండ్ల పేర్లు చెప్పుకుంటూ, ఇసుక ట్రాక్టర్ లకు పర్మిషన్ లు ఇస్తున్నారు. ప్రజలు అడిగితే ఏ కేవలం కందికట్కూర్ గ్రామ ప్రజల అవసరాల వరకే పర్మిషన్ ఇస్తున్నారు అని చెప్తున్నారు. అయితే, కందికట్కూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయిన కూడా పర్మిషన్ తీసుకొని మండలంలోని ఇతర గ్రామాలకు తరలిస్తు న్నారు.ఆ గ్రామం పేరు చెప్పి ఇతర గ్రామాలకు ఇసుక రవాణా చేయడం ఎంతవరకు సమంజసమని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తక్షణమే పై అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఇసుక తవ్వకాలను పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోని,గ్రామ పరిధిలో ఇసుక తవ్వకాలు జరపకుండా చూసి, ఇసుక తవ్వకాల వలన అటు ప్రాజెక్టుకు గ్రామ ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా చూడాలని యావత్




గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వేద న్యూస్

శుక్రవారం డిసెంబర్ 05, 2025

# ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి ప్రజలు సహకరించాలి

**– రూరల్ సీఐ పీ.వెంకట్**

**వేద న్యూస్, శంకరపట్నం :**

జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని పోలీసులు మండలంలోని మెట్టుపల్లి, కాచాపూర్ గ్రామాలలో గురువారం రోజున గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించి పలు సూచనలు చేయడం జరిగినది. ఈ సందర్భంగా హుజురాబాద్ రూరల్ సీఐ పి. వెంకట్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని, ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో ర్యాలీ నిర్వహించడం లేదా ప్రచార వాహనాలను వినియోగించడం కోసం ముందుగా సంబంధిత అధికారుల నుండి ప్రతి ఒక్క అభ్యర్థి అనుమతి తీసుకోవాలని, ఒకవేళ ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే చట్టప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని, సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టడం గానీ, మెసేజ్లు పెట్టే చర్యలు పలు సమస్యలకు దారితీస్తాయని, ప్రజలు స్వేచ్ఛ వాతావరణంలో తమకు నచ్చిన అభ్యర్థికి స్వచ్ఛందంగా ఓటు వేసే హక్కును వినియోగించుకోవాలి.ఎవరైనా ప్రజలకు ఆటంకం కలిగించిన, ఇబ్బంది పెట్టిన వెంటనే పోలీసులకు



సమాచారం అందించి గ్రామాల్లో శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికలు జరగడానికి గ్రామ ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శేఖర్ రెడ్డి తో పాటు పోలీస్ సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# గొర్రెల చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులతో పాటు వీరికి సహకరించిన మరో నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్టు చేసారు. వీరి నుండి పోలీసులు సుమారు 1,60,000 (లక్ష అరవై వేల రూపాయలను) రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ అరెస్టు సంబంధించి మామూనూర్ ఏసీపీ వెంకటేశ్ వివరాలను వెల్లడిస్తూ పోలీసులు అరెస్టు చేసిన నిందితుల మధ్య గతంలో పరిచయం వుండడంతో వీరికి వచ్చే అదాయం వీరూ చేసే జల్సాలకు సరిపోకపోవడం వలన నిందితులందరు కలసి గతంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడటంతో పాటు ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడటంతో పోలీసులు అరెస్టు చేసిన పలుమార్లు జైలుకు తరలించడం జరిగింది. నిందితులందరు జైలు నుండి విడుదల అయిన అనంతరం వారిలో ఎలాంటి మార్పు రాకపోగా, ఇండ్లల్లో చోరీలకు పాల్పడం ద్వారా పోలీసులకు చిక్కడం జరుగుతోందిని భావించి నిందితులు తమ పంథాను మార్చుకోని గ్రామాల్లో వుండే గొర్రెలను చోరీ చేసి వాటిని విక్రయించడం ద్వారా సులభంగా డబ్బు సంపాదించవచ్చని నిందితులు నిశ్చయించుకుని నిందితులు అనుకున్న ప్రకారం ముందుగా గ్రామాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో సెల్ఫ్ డ్రైవ్ కారులను కిరాయికి తీసుకొని ఆ కార్లల్లో వచ్చి తాము ముందుగా అనుకున్న ప్రాంతానికి వెళ్ళి అక్కడ వున్న గొర్రెలను దొంగిలించి కారులోకి ఎక్కించుకోని అక్కడి నుండి తప్పించుకోని పారిపోయేవారు. చోరీ చేసిన గొర్రెలను నిందితులు వర్ధన్న పేట ప్రాంతానికి చెందిన మాంస వ్యాపారం చేసే అంగడి వెంకన్నకు విక్రయించే వారు. నిందితులు ఇదే తరహాలో నాలుగు (4) గొర్రెల దొంగతనాలు పాల్పడ్డారు. ఇందులో గీసుగొండ, మామూనూర్, మిల్స్ కాలనీ, మడికొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో పాల్పడ్డారు. అంతేకాక గీసుకొండ పరిధిలో కొమ్మాల గ్రామ శివారులో ఇంట్లో ఎవరూ లేని ది గమనించి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న రూ.1,05,000 దొంగిలించారు. అంతేకాక మామునూరు పరిధిలో నీ బొల్లికుంట గ్రామంలో రాత్రి వేళలో ఇండ్లలలో ఎవరూ లేనిది గమనించి రెండు ఇలా తాళాలు పగలగొట్టి కొంత డబ్బులను దొంగిలించినారు. గీసుకొండ పరిధిలో జరిగిన చోరీలపై ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేసుకున్న గీసుగొండ్ పోలీసులు ప్రస్తుతం అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని దర్యాప్తు చేపట్టి పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా గీసుగొండ పోలీసులు ఉకల్ హవేళి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమాస్పదంగా వస్తున్న రెండు కార్లను పోలీసులు అపివేసి కార్లలో తనిఖీ చేయగా కార్లలో గొర్రెల మలంతో పాటు, వాటి జుట్టు కారులో గుర్తించి పోలీసులు కారులో ప్రయాణిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు గొర్రెలను చోరీలకు పాల్పడి వాటిని విక్రయించేవారమని నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించి అలా అమ్మగా వచ్చిన డబ్బు ఇదేనని నేరానికి పాల్పడగ వచ్చిన డబ్బులను పోలీసులు స్వాధీనపరచుకొని అరెస్ట్ చేయడం జరిగింది. నిందితులను పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన గీసుగొండ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్, ఎస్.ఐ కె. కుమార్, కానిస్టేబుళ్ళు విజయ్, అరవింద్, సాయి, హరి, రజని కుమార్ మరియు ఇతర సహకరించిన సిబ్బందిని మామూనూర్ ఏసీపీ అభినందిస్తూ తగిన శాఖపరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలియజేశారు.

# భవానిపురం కూల్చివేత దారుణం



**అమరావతి, వేద న్యూస్:**

విజయవాడ భవానిపురంలో 42 ఇండ్లను కూల్చివేసిన ఘటన రాజకీయంగా తీవ్ర ప్రతికూలతను రేకెత్తిస్తోంది. సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ ఇళ్లను కూల్చడం ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు చర్య అని వైఎస్ శర్మిల తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యలో మానవతా దృష్టికోణం పూర్తిగా లేకపోయిందని, ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను కనికరం లేకుండా రోడ్డున పడేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 25 ఏళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్న బాధిత కుటుంబాలు ఒక్కసారిగా నిలువ నీడ కోల్పోయిన పరిస్థితి ఆందోళనకరమని శర్మిల పేర్కొన్నారు. "పళంగా కట్టుబట్టలతో బయటికి తోసేయడం, చిన్నపిల్లలు, వృద్ధులు బాధపడుతున్న దృశ్యం చూస్తే హృదయం బరువెక్కుతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు మొహం చాటేశారని ఆమె ఆరోపించారు. సమస్యను వివరించేందుకు బాధితులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లినా, అపాయింట్మెంట్ ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని శర్మిల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను విని పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, బాధితుల్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరమని ఆమె చెప్పారు. భవానిపురం సమస్యపై కాంగ్రెస్ తరఫున స్పందిస్తున్నామన్న శర్మిల, ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. బాధితులను పిలిచి మాట్లాడాలని, వారి బాధను అర్థం చేసుకోవాలని, న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల కూల్చివేతకు సంబంధించిన వివాదానికి పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. ఇంటి కోల్పోయిన కుటుంబాలకు తక్షణ నివాస సదుపాయాలు, పరిహారం, పునర్వసతి వంటి అంశాలను ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించాలని శర్మిల డిమాండ్ చేశారు. బాధితుల ఆవేదనను అడ్డగోలుగా వదిలేస్తే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని ఆమె హెచ్చరించారు.

# విశాఖలో పోలీస్ ఆరోగ్య బీమా పథకం ప్రారంభం

**– ప్రజల రక్షకుల ఆరోగ్య భద్రత మా బాధ్యత"**

**మంత్రి అనిత**

**– పోలీస్ సిబ్బందికి ఆరోగ్య బీమా బాండ్ల పంపిణీ**

**అమరావతి, వేద న్యూస్:**

ప్రజా రక్షణ కోసం అహర్నిశలు పనిచేసే పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ ఆరోగ్య బీమా పథకాన్ని రాష్ట్ర మంత్రి అనిత వంగలపూడి ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సమక్షంలో ఈ పథకానికి సంబంధించిన బాండ్లను పోలీసులు అందుకున్నారు. ఈ సంక్షేమ కార్యక్రమం ద్వారా పోలీసుల ఆరోగ్య రక్షణకు అవసరమైన భరోసా కల్పించడమే లక్ష్యమని మంత్రి అనిత తెలిపారు. పోలీసులు ప్రజల కోసం 24 గంటలూ శ్రమిస్తూ, ప్రమాదాల మధ్య జీవితం సాగిస్తారని, వారి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. అనారోగ్య సమయంలో చికిత్స, వైద్య ఖర్చుల భారం కుటుంబాలపై పడకుండా ఆరోగ్య బీమా సహాయపడుతుందని పేర్కొన్నారు. సమాజ శాంతి కాపాడే వారి కృషికి ప్రతిఫలంగా ఈ పథకం సేవ చేయనుందని మంత్రి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు మేరీ ప్రశాంతి, మణికంఠ చందోలు




సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. బీమా పథకం అమలు, అర్హతల వివరాలు, ప్రయోజనాలు వంటి అంశాలను అధికారులకు వివరించగా, పోలీసులు ఈ అవకాశాన్ని సమర్థవంతంగా విని యోగించుకోవాలని సూచించారు. విజయవాడ పోలీసులు, హోంసెక్యూరిటీ సిబ్బంది, ట్రాఫిక్ విభాగం వంటి విభాగాలకు కూడా ఈ పథకం అందు బాటులోకి రావచ్చని సమాచారం. రాష్ట్రంలో పోలీస్ సంక్షేమ కార్యక్రమాలను విస్తరించే దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు సూచించాయి.

# జూనియర్ కబడ్డీ జట్టుకు కిట్ల పంపిణీ

**వేద న్యూస్, ఖమ్మం :**



మహబూబ్‌నగర్‌లో ఈ నెల 5 నుంచి నుంచి ప్రారంభమయ్యే జూనియర్ బాలుర తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఖమ్మం జిల్లా జట్టు సిద్ధమైంది. ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొననున్న ఖమ్మం జట్టుకు తుంబూరు దయాకర్ రెడ్డి ప్రత్యేకంగా కబడ్డీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జట్టు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎక్కువమంది యువ క్రీడాకారులు ఎంపికయ్యేలా శ్రమించాలని సూచించారు. జట్టుకు మెరుగైన సాధన కోసం మ్యాట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కటికల క్రిస్టాఫర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడారంగ బలోపేతానికి చర్యలు

**– ఇండోర్ స్టేడియం సందర్శనలో ఎమ్మెల్యే నాగరాజు**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వెనుకల గల ఇండోర్ స్టేడియాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సందర్శించి క్రీడాకారులతో మాట్లాడారు. అనంతరం కాసేపు క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే బ్యాట్మెంటన్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ క్రీడారంగ బలోపేతంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, ఇండోర్ స్టేడియంలో మరిన్ని వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవలే హనుమకొండలోని జెఎన్ఎస్ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ ను ప్రారంభించామని, విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. యువత మత్తును వదిలి మైదానాలకు చేరుకోవాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, నేటి ఓటమే రేపటి గెలుపుకు నాంది అని అన్నారు. క్రీడాకారులను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవాంజీకి ప్రభుత్వం కోటి రూపాయల నగదు అందించి ప్రోత్సహించిందని, భవిష్యత్తులో ఓరుగల్లు నుంచి క్రీడాకారులు రాష్ట్ర, దేశస్థాయిలో రాణిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి మనసు వింటేనే

# మన భవిష్యత్తు సురక్షితం

- నేల క్షీణత, ఆహార భద్రత, పర్యావరణ సంక్షోభం
- భారతదేశంలో మట్టి పరిస్థితి ఆందోళన కర స్థాయిలో
- శాస్త్రీయ వ్యవసాయం, రైతు శ్రేయస్సు, ప్రభుత్వ బాధ్యత
- వాతావరణ మార్పు, నీటి సంరక్షణతో అనుసంధానం

**వేద న్యూస్ డెస్క్**

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రపంచ మట్టి దినోత్సవం జరుపుకుంటారు. మట్టి అనే పదం చిన్నది, కానీ దాని ప్రాముఖ్యత అపారమైనది. మట్టిని 'నిర్జీవ పదార్థం'గా కాకుండా, 'పర్యావరణానికి శ్వాస ఇచ్చే ప్రాణమూలం'గా చూసే భావన రోజురోజుకు పెరుగుతోంది. మనం తినే అన్నం, తాగే పాలు, వేస్తున్న విత్తనం అన్నింటి పునాది మట్టే. కానీ ఇదే మట్టి నేడు ప్రమాదంలో ఉంది. గ్లోబల్ స్థాయిలో ప్రతిదినం వేలాది టన్నుల మట్టి కోల్పోతున్నాం. ఒకసారి మట్టి నాశనం అయితే, దాన్ని తిరిగి పునరుద్ధరించడానికి కావాల్సిన కాలం దశాబ్దాల కాలం. వ్యవసాయ విస్తీర్ణం పెరిగినా, భూమి ఆరోగ్యం పడిపోతున్న దేశం భవిష్యత్తులో ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశాలు అధికం.

భారతదేశంలో మట్టి క్షీణత ఒక తీవ్రమైన సమస్య. 52 శాతం వ్యవసాయ భూమి వివిధ స్థాయిల్లో క్షీణతకు గురవుతోంది. ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, నీటి అధిక వినియోగం, మోనోక్రాపింగ్, అరణ్య నశనం, ఎండలు, వరదలు ఇవన్నీ కలిసి మట్టి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. చాలా గ్రామాల్లో మట్టిలో జైవ పదార్థాల శాతం 2 శాతం కంటే తక్కువగా ఉంది. సేంద్రీయ పదార్థం అంటే నేలకి 'జీవం'. అది లేకపోతే, దిగుబడి తగ్గిపోవడం, ఖర్చులు పెరగడం, రైతు అప్పుల్లో కూరుకుపోవడం అనివార్యం. రైతు జీవితంలో ఒక సీజన్ నష్టపోతే, ఆ కుటుంబం ఐదు సంవత్సరాలు కష్టపడాల్సి వస్తుంది. మట్టి నాణ్యత తగ్గిపోవడం అనేది ప్రస్తుతం రైతుల ఆర్థిక సమస్యలకు మౌన కారణం.

పర్యావరణ కోణంలో చూస్తే, మట్టే మన పర్యావరణ సమీకరణంలో కీలక త్రికోణ బలం. మట్టి కార్బన్‌ను నిల్వ ఉంచుతుంది. అంటే, భూమి వేడెక్కకుండా, వాతావరణంలో కార్బన్ నిల్వను తగ్గిస్తూ, వాతావరణ మార్పును నియంత్రిస్తుంది. కానీ మట్టి నేల అరణ్య నశనం వల్ల కార్బన్ మళ్లీ వాతావరణంలోకి విడుదల అవుతుంది. ఇలా 'మట్టిలో క్షీణత' వాతావరణ సంక్షోభానికి ప్రత్యక్ష కారణం. అదే సమయంలో, వరదలు, కరవులు, నీటి కొరత కూడా మట్టిచేతనే నియంత్రించబడతాయి. భూమి స్థాయి నీరు నిల్వచేయడం, వర్షపు నీరు భూమిలోకి చొరబెట్టడం ఇవన్నీ పూడి మట్టి పని. మనం మట్టిని నాశనం చేస్తే, మనం నీటి భవిష్యత్తునే నాశనం చేసినట్లే.

ప్రపంచంలో పలు దేశాలు "సుస్థిర వ్యవసాయ శైలి"ని ప్రధాన ధ్యేయంగా చేసుకున్నాయి. సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడి, ఇంటర్లాకింగ్ ఫాం సిస్టమ్, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, అగ్రోఫారెస్ట్రీ వంటి పద్ధతులు విజయం సాధిస్తున్నాయి. భారతదేశంలో కూడా ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఆర్గానిక్ ఫార్మింగ్ వంటి పథకాలను ప్రవేశపెట్టింది. కానీ ఈ పథకాల ప్రభావం రైతు స్థాయిలో అవగాహన పెరిగినప్పుడే స్పష్టమవుతుంది. మట్టి పరీక్షలు చేయించకపోతే, యాదృచ్ఛికంగా ఎరువులు వాడితే, దిగుబడి తగ్గిపోవడం సహజం. నేల పరిస్థితిని తెలిసి, "ఏం పెంచితే మంచిదో" తెలుసుకోవడం రైతుకి సైన్స్ కాదు జీవన ఆవశ్యకత.


రైతులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు, పర్యావరణ సంస్థలు అందరు కలిసి మట్టిని రక్షించడానికి ప్రయత్నించాలి. మట్టిని కాపాడటం అంటే కేవలం 'పర్యావరణ రక్షణ' కాదుబీ అది ఆర్థిక రక్షణ, ఆరోగ్య రక్షణ, సమాజ రక్షణ. మట్టి బాగా ఉంటేనే రైతు బతుకుతాడు, రైతు బతికితేనే దేశం బతుకుతుంది. మట్టిలో సూక్ష్మజీవులు పెరిగితేనే, మన పిల్లలు ఆరోగ్యకరమైన ఆహారం తింటారు. చెట్లు నాటడం, సేంద్రియ పదార్థాలు మట్టిలో కలపడం, నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, ఎరువుల వినియోగం తగ్గించడం ఀ ఇవన్నీ చిన్న చర్యలు కానీ, భూమికి పెద్ద ఆశ. చివరగా, ప్రపంచ మట్టి దినోత్సవం మనకు చెప్పే అత్యంత ముఖ్యమైన సందేశం "మట్టిని కాపాడితేనే మనిషిని కాపాడగలం." మట్టి నాశనం అంటే కేవలం భూమి కోల్పోవడం కాదుబీ ఆహార భద్రత, రైతు భవిష్యత్తు, మన ఆరోగ్యం, పర్యావరణం అన్నింటినీ ప్రమాదంలో పడేయడం. గతంలో భూమి మనిషిని పోషించిందిబీ ఇక మనిషి భూమిని పోషించే సమయం వచ్చింది. భూమి ఆరోగ్యం బాగుంటేనే, దేశం బలంగా నిలబడుతుంది.భవిష్యత్తు తరాలు మనని "మట్టి కాపాడిన తరం"గా గుర్తుంచుకోవాలంటే, ఇప్పుడు చర్యలు ప్రారంభమవ్వాలి.

వేద న్యూస్

శుక్రవారం డిసెంబర్ 05, 2025

# కోహ్లీ 53వ శతకం

## - అనుష్క పోస్ట్ సోషల్ మీడియాలో హల్‌చల్





**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు ఓటమి పాలైనప్పటికీ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సాధించిన అద్భుత శతకం అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. మ్యాచ్‌లో కోహ్లీ బ్యాట్ నుంచి వెలువడిన ప్రతి షాట్ ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపగా, అతని శతకం పూర్తవగానే సోషల్‌మీడియాలో అనుష్క శర్మ స్పందన మరింత హల్‌చల్ రేపింది. తన భర్త 53వ వన్డే శతకాన్ని నమోదు చేసిన వెంటనే అనుష్క ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేక స్టోరీ పోస్ట్ చేసింది. మైదానంలో కోహ్లీ బ్యాట్ ఎత్తి అభిమానులకు నమస్కరిస్తున్న ఫోటోను షేర్ చేసిన ఆమె, దానిపై హృదయ, చప్పట్లు సూచించే ఎమోజీలను జత చేసి తన గర్వభావాన్ని వ్యక్తం చేసింది. ఎలాంటి వాక్యం లేకపోయినా, ఆ ఎమోజీల్లోనే అనుష్క ఆనందం, మద్దతు స్పష్టంగా ప్రతిబింబించాయి. ఈ స్క్రీన్‌షాట్ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో విస్తృత చర్చకు దారితీసింది. మ్యాచ్ వివరాల్లోకి వెళితే, కోహ్లీ (102) తో పాటు రుతురాజ్ గైక్వాడ్ (105) కూడా శతకాలతో రాణించడంతో భారత్ మొదట బ్యాటింగ్ చేసి 358 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే ఈ లక్ష్యాన్ని రక్షించడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. సౌతాఫ్రికా బ్యాటర్లు స్థిరంగా ఆడి 4 వికెట్ల తేడాతో విజయం సాధించారు. జట్టు ఓడిపోయినప్పటికీ కోహ్లీ పోరాట పటిమ నెటిజన్లను ఆకట్టుకుంది. అతడికి అనుష్క ఇచ్చిన మద్దతు కూడా అభిమానుల్లో పాజిటివ్ స్పందన రాబట్టింది. సిరీస్ విషయానికి వస్తే, తొలి వన్డేలో భారత్ విజయం సాధించడంతో డిసెంబర్ 6న విశాఖపట్నంలో జరగనున్న మూడో, చివరి మ్యాచ్ సిరీస్‌ను ఎవరు కైవసం చేసుకుంటారనే విషయంపై కసరత్తు కనిపిస్తోంది. మొదటి మ్యాచ్‌లో కోహ్లీ 52వ శతకం సాధించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, డిసెంబర్ 11న తమ ఎనిమిదో వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న కోహ్లీ%-%అనుష్క జంట లండన్‌లో స్థిరపడుతున్నారన్న వార్తలు కూడా సోషల్‌మీడియాలో ప్రచారంలోకి వచ్చాయి. 2017లో ఇటలీలో జరిగిన వీరి వివాహం, 2021లో జన్మించిన కుమార్తె వామిక, 2024లో పుట్టిన కుమారుడు అకాయ్‌ఇవన్నీ అభిమానులను ఎప్పటికప్పుడు ఆకర్షించే ముఖ్య విషయాలుగా నిలుస్తున్నాయి.

# ‘అఖండ 2’కి ప్రత్యేక అనుమతులు

- తెలంగాణలో.. టికెట్ ధరలు పెంపు
- సినిమా ప్రీమియర్స్‌కు గ్రీన్ సిగ్నల్



**వేద న్యూస్ డెస్క్:**

నటసింహం నందమూరి బాలకృష్ణ - మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన అఖండ 2 విడుదలకు ముందుగానే భారీ హైప్ క్రియేట్ అవుతున్న సమయంలో, తెలం గాణ ప్రభుత్వం ఈ చిత్రానికి ప్రత్యేక అనుమతులు ఇచ్చింది. డిసెం బర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి సంబంధించి టికెట్ ధరలను పెంచేందుకు అధికారికం గా అనుమతి లభించింది. తాజాగా వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై జీఎస్టీతో కలిపి అదనంగా రూ.50ను, మల్టీప్లెక్స్‌లలో జీఎస్టీతో పాటు అదనంగా రూ.100ను వసూలు చేసుకునే అవకాశం నిర్మాతలకు కల్పించారు. భారీ యాక్షన్, ఫుల్ మాస్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రం కోసం ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని  కోసం ప్రత్యేక ప్రీమియర్ షోకు కూడా తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 8 గంటలకు ప్రత్యేక ప్రీమియర్ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, ఆ ప్రీమియర్ టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.600గా నిర్ణయించింది. బాలయ్య అభిమానుల్లో ఈ నిర్ణయం భారీ ఉత్సాహాన్ని రేకెత్తించింది. పెంచిన టికెట్ ధరలు సినిమా విడుదలైన మొదటి మూడు రోజులపాటు మాత్రమే అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విడుదలైన తర్వాత క్రమంగా టికెట్ ధరలు యథాస్థితికి వస్తాయి. ఇప్పటికే అఖండ 2 ట్రైలర్‌కు వచ్చిన స్పందన, బాలయ్య%-%బోయపాటి కాంబినేషన్‌పై ఉన్న ప్రత్యేక క్రేజ్ దృష్ట్యా, ఈ చిత్రం తొలి వారం భారీ కలెక్షన్లు సాధించే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# కార్తి సినిమా రిలీజ్‌కు బ్రేక్

## - ‘అన్నగారు వస్తారు’పై హైకోర్టు మధ్యంతర స్టే




**వేద న్యూస్ డెస్క్:**

తమిళ స్టార్ హీరో కార్తి నటించిన తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ వా వాతి యార్ తెలుగు టైటిల్ అన్నగారు వస్తారు విడుదలకు ముందే పెద్ద షాక్ తగిలి ంది. డిసెంబర్ 12న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉన్న ఈ చిత్రంపై మద్రాస్ హైకోర్టు మధ్యంతర నిలుపుదల ఉత్తర్వు లు జారీ చేయడంతో మూవీ విడుదల తాత్కాలికంగా వాయిదా పడినట్లు పరి శ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ వివాదానికి కారణం నిర్మాత జ్ఞానవేల్‌రాజా - ఫైనాన్షియర్ అర్జున్‌లాల్ మధ్య నెలకొన్న ఆర్థిక సమస్యలేనని తెలుస్తోంది. నిర్మాత చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటి వరకు తీర్చలేదని అర్జున్‌లాల్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం పిటిషన్‌ను విచారించిన కోర్టు, తదుపరి విచారణ వరకు చిత్ర విడుదలను నిలిపివేయాలని ఆదేశిస్తూ మధ్యంతర స్టే విధించింది. ఈ నిర్ణయంతో ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం విడుదల సస్పెన్స్‌లో పడింది.

# రోహిత్ - కోహ్లీ రిటైర్మెంట్ వివాదంలో అగార్కర్ పాత్రపై చర్చ

**వేద న్యూస్ డెస్క్:**



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పుట్టినరోజు సందర్భంలో ఆయన కెరీర్, ప్రస్తుతం భారత క్రికెట్‌లో నడుస్తున్న పరిణామాలు మరోసారి అభిమానుల చర్చలోకి వచ్చాయి. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌లకు అగార్కర్ నిర్ణయాలే కారణమా? అన్న ప్రశ్న సోషల్‌మీడియాలో బాగా వినిపిస్తోంది. జట్టులో మార్పుల పేరుతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో కలిసి అగ్రశ్రేణి ఆటగాళ్లపై ఒత్తిడి పెంచారన్న ఆరోపణలు కూడా అభిమానుల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అగార్కర్ క్రికెట్ ప్రయాణం ప్రత్యేక రికార్డులతో నిండి ఉంది. ఒకవైపు లార్డ్స్‌లో టెస్ట్ శతకం నమోదు చేసిన అరుదైన భారత ఆటగాళ్లలో ఒకరిగా నిలిస్తే, మరోవైపు వరుసగా ఏడు టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో డకౌట్ కావడం, అందులో నాలుగు వరుస గోల్డెన్ డక్‌లు రావడం వంటి చేదు రికార్డులు కూడా ఆయన ఖాతాలో ఉన్నాయి. అయినప్పటికీ, వన్డేల్లో కేవలం కొన్ని మ్యాచ్‌ల్లోనే 50 వికెట్లు తీయడం, జింబాబ్వేపై అత్యంత వేగంగా అర్ధ శతకం నమోదు చేయడం, అడిలైడ్ టెస్ట్‌లో ఆరు వికెట్లు తీసి భారత్‌కు చారిత్రక విజయం అందించడం వంటి ఘనతలు ఆయన ప్రతిభను ప్రతిబింబిస్తాయి. సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీలు వచ్చిన అదే క్రికెట్ స్కూల్ నుంచి వచ్చిన విద్యార్థిగా అగార్కర్ ముంబై క్రికెట్‌లో కీలక స్థానం సంపాదించాడు. తర్వాత 2012%-%13 రంజీ ట్రోఫీలో ముంబైను 40వ సారి విజేతగా నిలిపిన కెప్టెన్‌గా కూడా గుర్తింపు పొందాడు. కానీ ఆయన చీఫ్ సెలెక్టర్‌గా వచ్చిన తరువాతే భారత జట్టులో జరిగిన మార్పులపై చర్చ గట్టిగా మొదలైంది. ప్రపంచ టీ20 తరువాత రోహిత్, కోహ్లీ కలిసి టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం, ఆ తర్వాత టెస్ట్ క్రికెట్‌కూ గుడ్‌బై చెప్పడం ఈ నిర్ణయాల వెనుక సెలక్షన్ కమిటీ ఒత్తిడి ఉందన్న అభిప్రాయాలు అభిమానుల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు రోహిత్‌ను పక్కనబెట్టి శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ అప్పగించాలని అగార్కర్ టీమ్ ప్రయత్నించారన్న వార్తలు కూడా అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఇవన్నీ కలిసివచ్చి భారత క్రికెట్ డ్రెస్సింగ్ రూమ్‌లో ‘కోల్డ్ వార్’ వాతావరణం నెలకొన్నట్లు అనేక వర్గాలు పేర్కొంటున్నాయి. సీనియర్ ఆటగాళ్లు, సెలక్షన్ కమిటీ, జట్టు నిర్వహణ మధ్య విభేదాలు తీవ్రంగా ఉన్నాయన్న సంకేతాలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్య వరుసగా నాలుగు గోల్డెన్ డక్‌లాంటి గత రికార్డుల తో అగార్కర్ పేరు మళ్లీ చర్చలోకి రావడం, ఆయన నిర్ణయాలే రోహిత్ - కోహ్లీ రిటైర్మెంట్‌లకు మూలమా? అన్న ప్రశ్న ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద వివాదంగా మారింది.

# నిప్పులు చెరిగిన స్టార్క్.. కానీ రూట్ రికార్డు





**వేద న్యూస్ డెస్క్:**

యాషెస్ తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ఇంగ్లండ్, గబ్బా టెస్టులో కూడా ప్రారంభంలో తడబడినా జో రూట్ ధైర్యవంతమైన శతకంతో నిలబడింది. మిచెల్ స్టార్క్ ఆరంభం నుంచే నిప్పులు చెరిగి ఇంగ్లండ్ టాపార్డర్‌ను ఛిద్రము చేసినప్పటికీ, రూట్ (135 నాటౌట్) ఒంటిచేత్తో ఇన్నింగ్స్‌ను నిలబెట్టి జట్టు స్కోర్‌ను 300 దాటించాడు. చివరి వికెట్ భాగస్వామ్యంతో ఇంగ్లండ్ తొలి రోజునే ఆలౌట్ ప్రమాదం నుంచి బయటపడింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోవడం పెద్ద షాక్‌గా మారింది. పెర్త్‌లో పదికి పది వికెట్లు తీసి స్టోక్స్ సేనను కుప్పకూల్చిన స్టార్క్, గబ్బాలో కూడా అదే గతి చూపించాడు. బెన్ డకెట్ (0), ఓలీ పోప్ (0)లను వరుసగా పెవిలియన్‌కు పంపి ఇంగ్లండ్‌ను గందరగోళంలో నెట్టాడు. ఈ సంక్షోభ సమయంలో క్రీజులోకి వచ్చిన రూట్, మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కగా నడిపించాడు. 181 బంతుల్లో శ్రమించి కంగారూ గడ్డపై తొలి శతకాన్ని నమోదు చేసిన రూట్, అదే సమయంలో తన టెస్ట్ కెరీర్‌లో 40వ సెంచరీని కూడా సాధించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతని క్లాస్, పట్టుదల మళ్లీ రుజువైంది. 264 పరుగుల వద్ద 9 వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ మళ్లీ పతనం అంచున నిలిచిన సమయంలో, రూట్‌కు జోఫ్రా ఆర్చర్ (32 నాటౌట్) రూపంలో బలమైన తోడు లభించింది. చివరి వికెట్‌కు ఇద్దరూ కలిసి 61 పరుగులు జోడించడం విశేషం. ఆర్చర్ బౌలర్లను జాగ్రత్తగా ఎదుర్కొంటూ, రూట్‌కు కావాల్సిన మద్దతు అందించాడు. ఫలితంగా తొలి రోజు స్టంప్స్ సమయానికి ఇంగ్లండ్ 325/9తో నిలబడి పరాజయ ముప్పును తప్పించుకుంది. ఇదిలా ఉండగా, స్టార్క్ 6 వికెట్లు (6/71) తీసి మరోసారి తనదైన ఆధిపత్యాన్ని చాటాడు. గబ్బాలో ఐదో వికెట్ తీసిన క్షణం నుంచే పాక్ దిగ్గజం వసీం అక్రమ్ రికార్డును అధిగమించి టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా అవతరించాడు. మొత్తంమీద రూట్ లాంటి పెద్ద ఇన్నింగ్స్ లేకపోయి ఉంటే ఇంగ్లండ్ పరిస్థితి మరింత దయనీయంగా మారేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ ఎక్కడ ముగుస్తుందో, ఆసీస్ ఎలా ప్రతిస్పందిస్తుందో అన్న దానిపై ఇప్పుడు ఆసక్తి కేంద్రీకృతమైంది.

# ప్రభాస్ జపాన్‌కు.. ‘స్పిరిట్’ షూట్‌కు తాత్కాలిక విరామం



**వేద న్యూస్ డెస్క్:**

బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బిజీగా ఉన్న గ్లోబల్ స్టార్ ప్రభాస్ ఈసారి తన అభిమానులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు స్పిరిట్ షూట్‌కు చిన్న విరామం ఇచ్చాడు. ఆయన ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో జరగనున్న బాహుబలి : ది ఎపిక్ ప్రత్యేక ప్రీమియర్‌లో పాల్గొనడానికి గురువారం జపాన్‌కు బయలుదేరాడు. ప్రభాస్‌తో పాటు బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుండడంతో, మేకర్స్ డిసెంబర్ 5, 6 తేదీల్లో ప్రత్యేక ప్రీమియర్లను ఏర్పాటు చేశారు. కల్కి 2898 ఏడీ ప్రమోషన్ల సమయంలో జపాన్ అభిమానులను ప్రత్యక్షంగా కలుసుకోలేకపోయిన ప్రభాస్, “తప్పకుండా వస్తాను” అని అప్పట్లో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మాట నిలబెట్టుకుంటూ రేపు అభిమానులతో ప్రత్యేక చిట్‌చాట్ సెషన్‌లో పాల్గొననున్నాడు. జపాన్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ కార్యక్రమాలకు భారీ రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా స్పిరిట్ చిత్రం షూటింగ్ ఇప్పటికే మొదలై, ప్రభాస్ - తృప్తి డిమ్రిపై కొన్ని కీలక సన్నివేశాలు ఇటీవలే చిత్రీకరించారు. అయితే జపాన్ పర్యటన కారణంగా షూట్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. టూర్ ముగిసిన వెంటనే ప్రభాస్ మళ్లీ సెట్స్‌పైకి వెళ్లి స్పిరిట్ షూటింగ్‌ను వేగంగా పూర్తి చేయనున్నాడు. మరోవైపు టాలీవుడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో హారర్ కామెడీ జోనర్‌లో రూపొందుతున్న రాజాసాబ్ 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి. వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రభాస్ ఇప్పుడు జపాన్ పర్యటనతో తన గ్లోబల్ స్థాయిని మరోసారి చాటుకోనున్నాడు.

# మెగాస్టార్ ‘మన శంకరవర ప్రసాద్’ నుంచి రెండో పాట ప్రకటన

**వేద న్యూస్ డెస్క్:**




మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో రూపొందుతున్న భారీ వినోద చిత్రం మన శంకరవర ప్రసాద్ నుంచి మరో సంగీత అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే విడుదలైన ‘మీసాల పిల్ల’ పాట అభిమానుల్ని ఉర్రూతలూగిస్తుండగా, ఇప్పుడు రెండో పాట విడుదల తేదీని చిత్ర బృందం ప్రకటించింది. ‘శశిరేఖ’ అనే పేరుతో రాబోయే ఈ పాటను డిసెంబరు 8న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ పాటకు సంబంధించిన చిన్న చూపు డిసెంబరు 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి పాట విజయంతో ఇప్పటికే సంగీతంపై భారీ అంచనాలు పెరిగాయి. తాజా అప్‌డేట్‌తో ఈ చిత్రం చుట్టూ మళ్లీ ఆసక్తి పెరిగింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో చిరంజీవితో పాటు వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా తదితర ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మితమవుతోంది.ఈ పాటను డిసెంబరు 8న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ పాటకు సంబంధించిన చిన్న చూపు డిసెంబరు 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి పాట విజయంతో ఇప్పటికే సంగీతంపై భారీ అంచనాలు పెరిగాయి. తాజా అప్‌డేట్‌తో ఈ చిత్రం చుటూ  విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అభిమానుల నుంచి భారీ స్పందన రావడం ఈ సినిమా కోసం ఎంత ఆసక్తి నెలకొన్నదో మరోసారి స్పష్టం చేస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073